# అల్లుడోడు

పెద్ద సైజు రేకు పెట్టె మీద లాఠీ కర్రతో చప్పుడు చేస్తూ, "అందులో ఏముంది తియ్" అన్నట్టుగా తలెగరేసాడు - ఆ బుర్ర మీసాల రైల్వే పోలీసు. పక్కనే మరో కానిస్టేబిలు ఆ దంపతుల వేపు మార్చి మార్చి చూస్తున్నాడు.

ఈ తతంగం మొదలయి పది నిముషాలవుతోంది. రైలు పరిగెడుతోంది. ఆ జనరల్ కంపార్ట్‌మెంట్ దట్టంగా నింపిన ఊక బస్తాలా క్రిక్కిరిసి పోయి ఉంది. రాత్రి పదకొండు దాటుతోంది. శీతాకాలం చలి గాలి వొంటిని ఝుల్‌మని పిస్తోంది.

కంపార్ట్‌మెంట్ లోకి పోలీసులు వచ్చి, ప్రయాణీకుల వస్తువుల్ని చెక్ చెయ్యడం మొదలయ్యేక, నిద్రలో జోగుతున్న వాళ్ళందరికీ మత్తు వదిలి పోయింది. మెలకువగా ఉన్న వాళ్ళు పోలీసుల చెకింగ్ బెడదకి విసుక్కుంటున్నారు. రాష్ట్రంలో మద్య నిషేధం మొదలయ్యేక, రైళ్ళలో, బస్సుల్లో ప్రయాణీకుల మీదా, వారి వస్తువుల మీదా నిఘా ఎక్కువయింది. రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలలో ఐతే, మరీ ఎక్కు వయింది. నిషేధం సడలించినా, అక్రమంగా రవాణా చేసే సారా పేకెట్ల కోసం తనిఖీలు తప్పడం లేదు. సారా మీద నిషేధం అలాగే ఉంది మరి.

"తియ్యమంటే నీక్కాదూ?" విసుగ్గా అన్నాడు మొదటి పోలీసు.

ముసిలాయన బెంబేలెత్తి పోయేడు. అతని పక్కనే గొంతుక్కూర్చున్న ఆ ముసలామె ఒక్క ఉదుటన పెట్టి మీదకి ఎక్కి కూర్చుంది. ఆమె కళ్ళలో భయం చారికలు చారికలుగా పరుచు కుంటోంది. "టిక్కెట్లు తీసినాం కాదా!" బెదురుతూ తీసి చూపించిందామె.

బుర్ర మీసాల పోలీసు కోపంగానూ, నిర్లక్ష్యంగానూ తలెగరేసాడు. "అది సరే!... ఆ పెట్టెలో ఏటుందో సూపించు ముందు..." అని వో వంకర నవ్వు నవ్వేడు. ముసిలాయన శరీరంలో సన్నని వణుకు మొదలయింది. దెయ్యాన్ని చూసిన వాడిలా ఆ పోలీసాయన వేపు చూస్తున్నాడు. ఆమె పరిస్థితి కూడా అంతకన్నా ఏమీ మెరుగ్గా లేదు. బెంగలకొండ మోస్తున్న దానిలాగా కళ్ళలో నీళ్ళు కుక్కుకుని ఉంది.

కంపార్టుమెంట్‌లో లెట్రిను ప్రక్కనే పెట్టె పెట్టుకుని, ప్రయాణం చేస్తున్నారు వాళ్ళు. పోలీసులు పెట్టె సోదా చేస్తామనే సరికి, ఇద్దరికీ ప్రాణాలు పైపైనే పోయినట్టయింది. కంగారుగా లేచి నించోడానికి ప్రయత్నించేరు. కానీ, లేవడానికి శక్తి చాల నట్టుగా చతికిల పడి పోయేరు.

వాళ్ళు ఉలుకూ పలుకూ లేకుండా బెదురు చూపులు చూస్తూండడంతో పోలీసులలో అనుమానం ఎక్కువయింది.

లాఠీ ఝళిపించి, ముసిలాయన వొంటి మీద చిన్న దెబ్బ వేసాడు ఒక పోలీసు.

"మనం యిలా – బాబూ, నయ్‌నా ఏటున్నాదమ్మా, అందులో? అని ముద్దుగా అడిగితే ఆళ్ళేం సెబుతారు గురూ! బొక్కలో తోసేసి, నాలుగు తగిలిస్తే నోళ్ళిప్పుతారు..." రెండో పోలీసు బెదిరింపులకి దిగేడు.

పెట్టెకి తాళం వేసుంది. "ఏయ్... ఏదీ, ఆ పెట్టె తాళం తీసి, ఏటుందో వో పాలి సూపించు... సెప్తుంటే నీక్కాదేటి?' ...తియ్ తాళం..." "తాళవా! తాళం... పోనాది బాబూ..." ఏడుపొక్కటే తరవాయిగా అందామె.

పోలీసులకి చిర్రెత్తుకు పోయింది. వాళ్ళ తీరు చూస్తుంటే అందులో ఏదో ఉండి తీరాలని పిస్తోంది. ఒరిస్సా నుండి సారా పేకెట్లు తెస్తున్నట్టున్నారు. లాభం లేదు... తాళంతీయించి సోదా చెయ్యాల్సిందే... తాళం తీసి పెట్టెలో ఏముందో చూపించమని మరో మారు గదమాయించేడు. ఆ ముసలి దంపతులు వాళ్ళని ఏడుస్తూ బ్రతిమాలు కుంటున్నారు.

కంపార్టుమెంటులో అందరి దృష్టీ ఈ గొడవ ఆకర్షించింది. అందరూ కుతూహలంగా అటు వేపు చూడ సాగేరు. ఉత్సాహం పట్ట లేని కొందరు దగ్గరగా వచ్చి, గుమి గూడేరు. టీవీ సీరియల్లో నవపాషాణాల పెట్టె లాగ, ఆ పెట్టెలోని రహస్యం తెలుసుకోవాలని వాళ్ళ ఉబలాటం. జనాలు గుమి గూడడంతో పోలీసులు మరింత రెచ్చి పోయి దబాయించడం మొదలు పెట్టారు.

"సెవిలో పూలెట్టకండి...తాళం పోనాదా! ఓసోసి ముసిల్దానా! నాకాడ కతల్సెప్పకు... నీలాంటి కంత్రీ నెంజల్ని సేనా మందిని సూసేను... తాళం తియ్..." "ఏట్సేదంటే యినవేం.." బెక్కుతూ అందామె. "అవునందులో ఏటీ నేదయ్యా... నాలుగు సింకి గుడ్డలు, మాయే, ... మరేట్నేవు... మమ్మల్నొగ్గీ తండ్రీ నీకు దండవెడతాను..." తొట్రు పాటు పడుతూ దీనంగా వేడుకుంటున్నాడు, ముసిలాయన.

వాళ్ళ కంగారు చూసేక, ఆ పెట్టెలో తాము ఊహిస్తున్నట్టుగా సారా పేకెట్లు కచ్చితంగా ఉండి తీరాలని నిర్ధారణ కొచ్చేసేరు పోలీసులు. దాంతో వాళ్ళ పట్టుదల మరింత ఎక్కువయింది. వాళ్ళు ఆ ముసలి దంపతులని మరింక వదల దల్చుకోలేదు.

ఆ పాసింజరు రైలు ఒరిస్సా రాష్ట్రం నుంచి ఆంధ్రా సరిహద్దుల్లోకి సరిగ్గా అర్ధ రాత్రి పూట ప్రవేశిస్తుంది. చిన్నా చితకా వ్యాపారులు – కర్రలూ, బొగ్గుల బస్తాలూ, చిన్న చిన్న మూటలతో బియ్యం – ఆంధ్రా సరిహద్దు ప్రాంతమైన పార్వతీపురానికి విరివిగా చేర వేస్తూ ఉంటారు. వీళ్ళకిరైల్వే అధికారులూ, పోలీసుల అండదండలు బాగానే ఉంటాయి. సాధారణంగా వీళ్ళలో ఎవరూ టిక్కెట్టు కొని ప్రయాణం చెయ్యరు. ఈ మద్య నిషేధం అమలు లోకి వచ్చేక, మద్యం అక్రమ రవాణా ఆ రైల్లో ఎక్కువయింది. కొత్త కొత్త పద్ధతుల్లో సారా పేకెట్లనీ, మద్యం సీసాలనీ ఆంధ్రాలోకి సరఫరా చేస్తున్నారు. నిషేధం ఎత్తి వేసాక కూడా సారా పేకెట్ల రవాణా తగ్గలేదు. ఈ లాభసాటి అక్రమ వ్యాపారంలో చాలా మంది జేబులు నింపుకుంటున్నారు.

చెకింగు ముమ్మరమైంది. అస్మదీయులని చూసీ, చూడనట్లు వదిలేసినా, కొందరి మీద మాత్రం కేసులు బుక్ చేస్తున్నారు.

"తాళం పోనాదంటే నోట్లో ఏలేసుకుని ఎలి పోతావనుకుంటున్నావు గావాల! ఓర్నాయనో యిదెవత్తో జగజ్జెంత్రీ నాగుంది... ఓసి! కిలాడి! ...తియ్యవే తాళం..." హుంకరించేడు పోలీసు. "అందులో ఏట్నేదని సెప్పవే నెంజా" ముసిలాయన భయంతో వణికి పోతున్నాడు. పెట్టికి అడ్డంగా ముసిలామె కాళ్ళముందుకి జరిగాడు. "స! నెగెస్! రైల్లోంచి బయటకి యిసిరీ గల్ను..." ముసిలాయన జబ్బ పట్టుకుని, బలంగా పక్కకి నెట్టాడు బుర్ర మీసాల పోలీసు. ముసిలాయన దబాలున పక్కకి పడ్డాడు. బాత్ రూం తలుపు అంచుకి వాడి తల తగిలింది. బాధగా మూలిగేడు. "ఓలమ్మ... ముసిలోడ్ని సంపేస్తారు గావాల్నా... మీకేటి పోగాలవా! సెప్తే యినుకో రేటీ!.. అందులో ఏట్నేప్..." గుండెలు బాదుకుంటూ ఏడుస్తోందామె.

రెండో పోలీసుకి తిక్క రేగింది. ముసిల్దాని జబ్బ పట్టుకుని, గుంజి, దాని రొండిన చెయ్యి పెట్టి తాళం చెవి లాగేడు. ఆమె ఏడుపు తారాస్థాయినందుకుంది. "బాబ్బాబు... చెమించండి... అందల ఏటీ నేవు... ఒగ్గెయ్యండయ్యా... మీకు పున్నెముంటాది..." కన్నీళ్ళతో దేబిరిస్తూ ఆ పోలీసు కాళ్ళకి చుట్టుకుందామె. పురుగును దులపరించేసి నట్టుగా ఆమెని పక్కకి పడేలా విదిల్చి కొట్టేడతను. "ఓరి బాబూ! యీ ముసిల్ది గుండెలు తీసిన బంటు నాగుందిరా నాయనా!... సూడు... సూడు... అందల ఏటుందో... అందులో సరుకు దొరకాల! యీళ్ళ పనుంది అప్పుడు..." రెండో పోలీసు హుషారుగా అన్నాడు. "మా బాబబు... ఆ పెట్టి తెరవకండి... మీకు దండవెడతాను..." ముసిలామె గుండెలవిసేలా ఏడుస్తోంది.

వాళ్ళు తాళం తీసి, పెట్టె తెరవబోతూ ఉంటే, భయంతో ఎక్కడ లేని సత్తువ వచ్చినట్టు తటాలున లేచి నించున్నాడు ముసిలాయన. "దాన్ని తెరవొద్దు... తెరవొద్దు బాబూ... సచ్చి మీ కడుపుల పుడతా... తండ్రీ... తెరువొద్దు... ఓలమ్మ దేవుడా! నా మాటినుకోండి. దాన్ని తెరవొద్దయ్యా..." కంగారు కంగారుగా, భయం భయంగా, వేగం వేగంగా – అతి దీనంగా వేడుకుంటున్నాడు ముసిలాయన. అందరి లోనూ ఉత్కంఠ ఎక్కువయింది. పోలీసు పెట్టె తాళం తీసి, తెరుస్తూ ఉంటే, తొంగి తొంగి కుతూహలంగా చూడ సాగేడు. తమ ప్రయత్నాలన్నీ విఫలమై నిస్త్రాణగా ముఖం చేతుల్తో కప్పుకుని, కూలబడి పోయిందామె. ముసిలాయన జవసత్వాలు ఉడిగి పోయి, కొయ్యబారి పోయేడు. వాళ్ళ గుండెలు భయంతో అవిసి పోతున్నాయి. అందరిలోనూ అంతు లేని ఆత్రుతనీ, కుతూహలాన్నీ రేపిన ఆ పాత కాలపు రేకు పెట్టె చివరకి తెరిచి చూసేడు పోలీసు.

అంతా అవాక్కయి పోయేరు!

నిజమే! వాళ్ళన్నట్టు అందులో నిషేధ వస్తువు లేవీ లేవు ... ఓ నాలుగు మాసిన బట్టలూ, కొయ్య దువ్వెన, చిన్న అద్దం – యిలాంటివే ఏవో ఉన్నాయి.

పోలీసు లిద్దరికీ మతి పోయింది. ఈ పాటి దానికి ఆ ముసిలాళ్ళు ఇద్దరూ అంత హైరానా ఎందుకు పడి పోయేరో వాళ్ళకి అర్థం కాలేదు. చేతి వరకూ వచ్చిన నిధి జారి పోయినట్టుగా నిరాశ పడి పోయేరు. ఆ పెట్టె లోని బట్టలని చిందర వందర చేసి, తిట్టుకుంటూ, వాళ్ళ నొదిలి వేరే కంపార్టుమెంటులోకి వెళ్ళిపోయేరు.

చుట్టూ చేరిన జనాలకి యిదంతా చిత్రంగా తోచింది. ఈ మాత్రం దానికి, ఆ ముసిలాళ్ళు ఇద్దరూ ఎందు కంతగా భయ పడి పోయేరో వాళ్ళకి అర్థం కాలేదు. "మతి స్థిమితం లేదు కాబోలు" ఒకరిద్దరు కామెంటు చేసారు. కొంత చిరాగ్గానూ, మరి కొంత ఏదో తమాషా చూసేమన్న తృప్తి తోనూ అందరూ తమ తమ సీట్లలోకి సర్దుకున్నారు. రైలు పరిగెడుతూనే ఉంది. ఆ జనరల్ బోగీ లోని చిన్న ప్రపంచం తిరిగి తన ధోరణి లోకి తాను పడి పోయింది. గాజు కళ్ళలో వెయ్యి ప్రశ్నార్థకాలు నింపుకుని, ఆ ముసిలాయన భార్య ముఖంలోకి చూసేడు. పెట్టెలో ఉండ వలసినదేదో లేక పోవడంతో, అతనికి ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. కోపం తెప్పిస్తోంది. భార్య అతని ముఖంలోకి దీనంగా చూసింది. మరేం అనవద్దని తల తాటిస్తోంది.

ముసలాయన కోపంగా ఆమె వేపు చూసేడు. "అట్నేటి సేసినావే." కోపంతో అతని ముకుపుటాలు అదిరి పోతున్నాయి. ఏం చెప్పాలో తోచ లేదు ఆమెకు. "నీ యవ్వ... నిజం సెప్తావా, రైల్లోంచి దూకి సావమంటావా?" చూపుడు వేలు ఆమె ముఖం మీద ఆడిస్తూ బెదిరించేడు. "ఓరి దేవుడా!" గొల్లున ఏడుస్తూ చేతుల్లో ముఖం దాచుకుందామె. భార్య బదులు చెప్పక పోవడంతో ముసిలాయనకి చిర్రెత్తు కొచ్చింది.

భార్య జుట్టు పట్టుకుని, వంచి, నడ్డి మీద దబ దబ బాదుతూ అరుపులు ప్రారంభించేడు. "పెట్లో దాచేసని నాతో అబద్ధమెందుకాడి నావే? సెప్పు...ఆటినేటి సేసేవు? గవిరి గాడికి నానేటి సెప్పు కోవాల? ఉత్తి సేతుల్తో వొస్తే అమ్మి నొగ్గేస్తానని ఆడు సెప్ప నేదా! మన బిడ్డ నచ్చుమమ్మ సంసారం బుగ్గయి పోతాదని తెల్దా నీకు? కన్నకూతురి బతుకులో నిప్పులు పోస్తున్నావు గదే – నీ యవ్వ... నీ కిదేటి పోగాలువే?..." వాడు కొట్టిన దెబ్బలకి తట్టుకోలేక ముసిలావిడ లబో దిబోమంటోంది. కన్నీరు మున్నీరుగా ఏడుస్తోంది.

ఆ ముసిలి దంపతులు దేని కోసం అలా ఘర్షణ పడుతున్నారో కంపార్టుమెంటులో ఎవరకీ అర్థం కావడం లేదు. ఒకరిద్దరు కలగ జేసుకుని, ముసిలాయన్ని శాంతింప చేద్దామని ప్రయత్నించేరు. కానీ, సాధ్య పడ లేదు. మరింత రెచ్చి పోయి, భార్యని చితక బాదుతున్నాడు.

ముసిలామె ఏడుస్తూ కొట్టొద్దని బతిమాలు తోంది. కాళ్ళా వేళ్ళా పడింది. వేడుకుంటోంది. దెబ్బలు తిని తిని విసిగి పోయి, ఆఖరికి ఒక్క సారిగా భర్త మీదకి తిరగ బడింది. భర్త రెండు జబ్బలూ పట్టుకుని, ఒక్క కుదుపుతో పక్కకి పడేలా తోసింది. సన్నని జీరతో ఏడుస్తూ, అయినా, స్ఫుటంగానే, అంది: "ఓరోరి ముసిలాడా! – ఏట్రా నీ పోత్రం? మరొక్క దెబ్బ నా వొంటి మీద పడినా దంటే మక్క లిరగ దీసీ గల్ను. జేగర్త – జెర్రి పోతుల కాము నాయుడి గారి బొట్టిని! ఏటను కుంటున్నావో?" ముసిలాడు ఆమె విసిరిన విసురుకి జనాల కాళ్ళ దగ్గర పడి రొప్పుతున్నాడు. అసలు విషయం ఏమిటని ఎవరో అడిగేరు.

"మజ్జి గైరమ్మ యాత్ర కెల్నాం బాబూ! ఒరిస్సాలో సారా తాగితే పోలీసు లట్టు కోరు కద? మా అల్లుడోడు... ఆడనుండి సారా పేకెట్లు తెమ్మని యాడికి సెప్పినాడు... సారా పేకెట్లు తేకండ వుట్టి సేతుల్తో వొస్తే గమ్మం నోకి రానియ్య నన్నాడు...నా కూతురి మీద కిర్సనాయిలు పోసి తగలెట్టెస్తా నన్నాడు... ఆ తాగుబోతెదవ మాటలకీడు బెదిరి

పోనాడు... ఆడ సారా పేకెట్లు కొని, పెట్లో ఎట్టమని కూకున్నాడు. "మరి, వాటినేం సేసావ్? పెట్లో ఏం లేక పోతే మరంత భయపడి పోయావెందుకు?" ఆసక్తిగా అడిగేడాకాయన. "నేనెంత సెప్పినా యిన లేదు. ఆట్నే పెట్టె లెట్టి, మా వూరికి తీసి కెళ్ళాల్సిందే నని పేచీ ఎట్టేడు. నేక పోతే అసలు రైలెక్కనని పట్టు పట్టేడు... ఆ మహమ్మారి పేకెట్లని అక్కడే, టేసను బయట యీడికి తెలీకుండా పారేసినాను..." ముసిలాయన తెల్ల బోతూ వింటున్నాడు.

"ఈడి మాటలిన్నారు కద బాబు? అల్లుడోడికి బెదిరిపోయి, నా కూతురి బతుకులో నాను నిప్పులు పోస్తున్నానంటున్నాడు... మీరుసెప్పండి... దాని బతుకు బండలు సేస్తున్న దెవులు? నా పెనిమిటి కాదా! మా అల్లుడోడు కాడా...!?" "మరి – అల్లుడోడికి ఏటి సెప్తావే..." ముసిలాయన నీళ్ళు నములుతున్నాడు. జారి పోయిన జుత్తుని వేలు ముడి వేస్తూ, కోపంగా జవాబిచ్చింది. ముసిలామె: "థూ!.. నీ సిగ్గోసిరి... ఆడికి బయ పడతా వేటెస్.. మా నెల్లూరప్ప ఏటి సేసి నాదో ఎరిక నేదా! ఆడు మల్ల సారా వూసు ఎత్తి నాటంటే... ఆడి కాళ్ళిరిసేసి పొయ్యిలెట్టెస్తాను... తెల్సిందా!"

ముసిలావిడ మాటల్ని హర్షిస్తూ – చప్పట్లు కొడుతున్నట్టుగా రైలు ధణ ధణ మని శబ్దం చేస్తూ పరిగెడు తోంది.

* * *

*ఆంధ్ర జ్యోతి సచిత్ర వార పత్రిక దశాబ్ది ప్రత్యేక సంచిక (15-8-1997)లో ప్రచురణ.*